ప్రజాశక్తి
మంగళవారం 19 నవంబర్ 2024 5 అనంతపురం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్లకార్డులతో పాల్గొన్న ఆశాలు..

ఆశాల ఆగ్రహం..!

◆ కలెక్టరేట్ వద్ద ధర్నా
◆ ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్
◆ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
◆ మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు ఆశ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల ఆరోగ్యం కోసం ఆశలు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కనీస వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రభుత్వ సెలవు లు, ఇన్సూరెన్స్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అదనపు పనులు చేయిస్తూ వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలేజ్ హెల్త్ సెంటర్ల దగ్గర ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉండాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. సచివాలయ ఎఎన్ఎంలు ప్రతిరోజూ సచివాలయాలకు రావాలని ఆశలను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. వ్యాక్సిన్ క్యారియర్ చేస్తే ఆశలకు ప్రత్యేక వేతనం ఇస్తామని ఆదేశాలు ఉన్నా అది అమలుకు నోచుకోలేదన్నారు. ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఆశలకు సంబంధం లేని పనుల నుంచి పూర్తిగా మినహాయింపు ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ జీవో ప్రభుత్వ సెలవులు జీవో వెంటనే విడుదల చేయాలన్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ జీవోలు ఇవ్వాలన్నారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిల వేధింపులు ఆపాలన్నారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల రిక్రూట్మెంట్లో అర్హులైన ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. 1000 నుంచి 1500 జనాభాకు ఒక ఆశా వర్కర్‌ను నియమించాలన్నారు. ఎన్‌సిడిసి సర్వేను ఆశలతో చేయించరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి గోపాల్, కార్యదర్శి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాలతి, ఎం.నాగమణి, అక్కమ్మ, భాగ్యమ్మ హుస్సేన్‌బీ, నాగమణి అంబిక, చంద్రకళ పాల్గొన్నారు.

సైలెంట్‌గా 'స్మార్ట్ మీటర్లు'

◆ చాపకింద నీరులా మీటర్ల బిగింపు
◆ ప్రభుత్వ కార్యాలయాలకే కాకుండా దుకాణాలకు ఏర్పాటు

స్మార్ట్ మీటర్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సైలెంట్‌గా స్మార్టు మీటర్ల బిగింపు జరుగుతోంది. మొదట ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమేనని చెప్పినప్పటికీ చాపకిందనీరులా ప్రయివేటు దుకాణాలకు బిగింపు మొదలైంది. అనంతపురం నగరంలో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో స్మార్టు మీటర్లు బిగింపు ప్రారంభమైంది. అనంతపురం నగరంలోని రుద్రంపేట బైపాస్ సమీపంలోని ఐదు దుకాణాల్లో స్మార్టు మీటర్లను బిగించారు. నగరంలోని వీధిలైట్లకు కూడా స్మార్టు మీటర్ల బిగిస్తున్నారు. ప్రతి వీధికి ఒక మీటరు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.

మూడు నెలల తరువాత యాక్టివేషన్

ఇప్పుడు మీటర్లు ఏర్పాటు చేసినప్పటికీ రీఛార్జీ ప్రక్రియ మాత్రం మూడు మాసాల తరువాత ప్రారంభమవనుందని అధికారులు చెబుతున్నారు. ఇది అమల్లోకి వచ్చాక పరిస్థితి ఏమిటన్న సందేహాలు అందరిలోనూ ఉన్నాయి. దీనిపైన అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాలు, నగర పాలక సంస్థ వీధిలైట్లు రీఛార్జీ సకాలంలో చేయకపోతే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముందన్న అనుమానాలున్నాయి. ఆచరణలో అమల్లోకి వస్తే కొత్త సమస్యలు తెరపైకొచ్చే అవకాశముంది.

కూటమి నేతలు మౌనం

ఎన్నికల ముందు వరకు స్మార్టు మీటర్లకు వ్యతిరేమని ప్రకటించిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఇప్పుడు దీనిపై మౌనంగా ఉంటుండటం గమనార్హం. గతంలోనే నుంచి సిపిఎం, రైతు సంఘాలు స్మార్టు మీటర్లకు వ్యతిరేకంగా నిరసనలు సైతం చేపట్టడం జరిగింది. దీనికి టిడిపి కూడా అప్పట్లో మద్దతునిచ్చింది. అయితే అధికారంలోకి వస్తే లేకుండా చేస్తామని హామీనిచ్చారు. సిపిఎం మాత్రం దీనిపై నిరసనలకు సిద్ధమవుతోంది. స్మార్టు మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

స్మార్టు మీటర్లు ఏర్పాటు ఆపాలి

ప్రజలపై భారాలు మోపేందుకు స్మార్టు మీటర్ల ఏర్పాటు ఆపాలి. గత ప్రభుత్వ హయాంలో అమలు చేయాలనుకున్న విధానాలనే ఈ ప్రభుత్వం అవలంభించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ట్రూఆఫ్ ఛార్జీల పేరుతో భారాలు మోపుతోంది. స్మార్టు మీటర్లతోనూ అదనపు భారం వేయాలని చూడటం సరైంది కాదు. ఇప్పటికైనా స్మార్టు మీటర్లను ఏర్పాటును నిలిపివేయాలి.

వి.రాంభూపాల్ ,
సిపిఎం జిల్లా కార్యదర్శి.

బాబా జయంతి రథోత్సవంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సత్యసాయి జయంతి ఉత్సవాలు ప్రారంభం

◆ రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు
◆ అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉత్సవ విగ్రహాల పల్లకి మోస్తున్న రత్నాకర్, మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

పట్టణంలో వేణుగోపాల స్వామి రథోత్సవంతో సత్యసాయి బాబా జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంతో పాటు పట్టణంలోని దుకాణాలు హోటళ్లు ప్రత్యేక అలంకరణలు చేశారు. సోమవారం వేణుగోపాల స్వామి గుడి నుంచి రథోత్సవాన్ని గోపురం గేటు వరకు భక్తులు లాగారు. సాయి కుల్వంత్ హాలులో సత్యనారాయణ వ్రతం పూర్తి కాగానే అక్కడి నుంచి పల్లకీలు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకీలు తీసుకొచ్చి రథంలో ప్రతిష్ఠించారు. ఈ పల్లకిని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ట్రస్టు సభ్యులు మోసారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి వేణుగోపాల స్వామి గుడి వరకు భక్తులు రథన్ని భక్తి పరవశంతో లాగారు. ఈ కార్యక్రమం తిలకించడానికి దేశ విదేశీ భక్తులతో పాటు పుట్టపర్తి పరిసర ప్రాంతాల నుంచి వేలాది మందిగా ప్రజలు తరలివచ్చారు. ఈ రథోత్సవం ముందు భాగంలో కీలుగుర్రాలు, గురవయ్య నత్యాలు, నెమలి నత్యాలు, కోలాటాలు, చెక్క భజనలు తదితర సాంస్కతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఎస్పీ రత్న ఆధ్వర్యంలో పలువురు డీఎస్పీలు, సిఐలు ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

ప్రశాంతి నిలయంలో ఉచిత అన్న ప్రసాదాలు

ప్రశాంతి నిలయం వెస్ట్ గేట్ వైపు సోమవారం ఉచిత అన్నదాన ప్రసాదాలు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ ట్రస్టు సభ్యులు ప్రారంభించారు. ఈనెల 18 నుంచి 23 వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఎంతమంది పాల్గొన్న అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి ట్రస్టు అన్ని చర్యలు చేపట్టింది.

చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుందాం

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ, జెడ్పీ ఛైర్‌పర్సన్ తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

చారిత్రిక వారసత్వ సంపదను కాపాడుకునేలా ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు సాగాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాల శాఖ, పర్యాటక శాఖ, ఇంటాక్‌ల ఉమ్మడి ఆధ్వర్యంలో సోమవారం నాడు ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2024 హెరిటేజ్ వాక్ (వారసత్వ నడక)ను అనంతపురం నగరంలో నిర్వహించారు. అనంతపురం కోర్టు రోడ్డులో నిర్మించబడిన పీస్ మెమోరియల్ హాల్ నుంచి పద్మ శ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శన శాల వరకు ఈ ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చారిత్రక స్పృహను పెంపొందించుకుని ఘనమైన వారసత్వాన్ని కాపాడుకోవాలని ప్రాచీన వారసత్వం, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం రాష్ట్ర పురావస్తు, ప్రదర్శన శాలల శాఖ, సహాయ సంచాలకులు (టెక్నికల్) డాక్టర్ వి.రజిత, పర్యాటక శాఖ జిల్లా అధికారి జయకుమార్ బాబు, ఇంటాక్ కన్వీనర్ రామ కుమార్‌తో పాటు వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కనకదాస జీవితం సమాజహితం

◆ చైతన్యం చేసిన ఆయన కీర్తనలు
◆ జయంత్యుత్సవాల్లో మంత్రి సవిత
◆ అనంతలో రాష్ట్ర స్థాయి వేడుకలు

భక్తకనదాస చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు

మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీ భక్తకనకదాస జీవితం సమాజ హితం కోరుతూ కొనసాగిందని, ఆయన కీర్తనలు ప్రజలను చైతన్యం చేశాయని రాష్ట్ర బిసి, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలియజేశారు. అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డు కెటిఆర్ కన్వెన్షన్ హాల్లో శ్రీ భక్త కనకదాస రాష్ట్రస్థాయి జయంత్యుత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. అంతకు మునుపు గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి, చేనేత సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, అనంతపురం, హిందూపురం ఎంపీలు అంబిక లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర బిసి.వెల్ఫేర్ ప్రిన్సిపాల్ సెక్రటరీ పోలా భాస్కర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ డా॥ఎ.మల్లికార్జున కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ భక్త కనకదాస అందరూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారన్నారు. ఊరురా కీర్తనలు చేస్తూ ప్రజలను చైతన్యం చేశారన్నారు. రాష్ట్రంలో బీసీలు, బలహీన వర్గాల వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కురుబలను రాజకీయంగా, ఆర్థికంగా ముందుకు తీసుకువచ్చారన్నారు. బీసీలను గుర్తించి వారు అన్ని రంగాల్లో ముందుండాలని కోరుకునేది తెలుగుదేశం పార్టీ అన్నారు. జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు బిసిలకు ఇచ్చి, తనను మంత్రిగా చేశారని తెలిపారు. కురుబలు షీఫామ్ పెట్టుకుని వ్యాపారాలు చేస్తున్నారని, వారికి రూ.50 లక్షల రుణాలు ప్రతి యూనిట్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందులో 10 శాతం లబ్ధిదారుని వాటా, 40 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంకు రుణం వస్తుందన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కురుబ కనకదాస కళ్యాణ మండపానికి రూ.20 లక్షల ఎంపీ నిధులు కేటాయిస్తామన్నారు. ఎంపీ బికె.పార్థసారధి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు భక్త కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహించాలని చంద్రబాబుని అడిగితే ఆయన హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేరుస్తూ అధికారికంగా కనకదాసు జయంతిని అనంతపురంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కురుబలందరూ సమానంగా ఎదిగి హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బు కొఠారి, ఆర్డీవో కేశవనాయుడు, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, తహశీల్దార్ హరికుమార్, సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీష్, జిల్లా కురుబ కుల సంఘాల నాయకులు తిప్పటి ఈశ్వరయ్య, తగరకుంట కృష్ణమూర్తి, ఆంజనేయులు, ఆవుల కృష్ణయ్య, గంగులకుంట రమణ, సీనయ్యతో పాటు ఉమ్మడి జిల్లాలోని కురుబలు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఫీజుల వేధింపులు ఆపండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జెఎన్‌టియు పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులపై ఫీజులు వేధింపులు ఆపేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి సుదర్శన్ రావుకు సోమవారం నాడు వినిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓతురు పరమేష్, సిద్దు మాట్లాడుతూ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు ప్రభుత్వం మూడు విడతల వసతి దీవెన, విద్యా దీవెన పెండింగ్‌లో ఉంచిందన్నారు. స్కాలర్‌షిప్‌లు కూడా విద్యార్థుల తల్లి అకౌంట్లో వేయలేదన్నారు. ఈ పరిస్థితుల్లో జెఎన్‌టియు పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించడం కోసం యూనివర్సిటీ అధికారులు సర్కులర్ జారీ అయ్యిందన్నారు. దీన్ని అవకాశంగా చేసుకున్న ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు మొత్తం బకాయిలు చెల్లిస్తూనే మీతో పరీక్ష ఫీజు కట్టించుకుంటాం మిమ్మల్ని పరీక్షకు అనుమతిస్తామని చెబుతూ విద్యార్థుల్ని భయాందోళన గురి చేస్తున్నారన్నారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థుల తల్లిదండ్రుల ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి దీవన, విద్యా దీవనతో సంబంధం లేకుండా విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలన్నారు. ఫీజులు కోసం కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు భీమేష్, సోము, వంశీ తదితరులు పాల్గొన్నారు.

స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

ప్రజలకు అధిక ధరలకు ఈ-స్టాంపులను విక్రయిస్తున్న స్టాంపు వెండర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ-స్టాంపులపై అదనంగా ఛార్జీలు వసూలు చేస్తున్న స్టాంపు వెండర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాకుండా స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండు నెలల నుంచి ఈ-స్టాంపులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ప్రధానంగా బర్త్, డెత్ సర్టిఫికెట్, హౌస్ టాక్స్ అగ్రిమెంట్, బ్యాంకు రుణాలు కోసం ఇలా అనేక రకాల వాటికి ప్రజలు స్టాంపులు అందుబాటులో లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది స్టాంప్ వెండర్లు ఒక్కో రూ.వంద స్టాంపునకు రూ.150 నుంచి రూ.200 వరకూ వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు వారి లైసెన్స్ కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాకే నాగరాజు, మారుతీప్రసాద్, జగ్గలి రమేష్, కసాపురం రమేష్, సురేంద్ర, తిమ్మప్ప, రామునాయక్, షాషా, మల్లికార్జున పాల్గొన్నారు.

ఆపద సమయంలో అరుదైన బ్లడ్ గ్రూప్ రక్తం అందజేత

సేకరించిన రక్తం

ప్రజాశక్తి-అనంతపురం

అరుదైన బాంబే బ్లడ్ గ్రూపునకు చెందిన రక్తాన్ని సాయిట్రస్టు ఏర్పాటు చేసి ప్రాణాలను కాపాడింది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక రాష్ట్రం సిరిగుప్ప పట్టణానికి చెందిన సరోజ వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగింది. ఆమెను బళ్లారిలోని సిరిగుప్ప రోడ్డులో ఉన్న బళ్లారి హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షల అనంతరం బ్లడ్ ట్రాన్స్ మిషన్ చేయాలని బాధితురాలికి బ్లడ్ గ్రూపు పరీక్ష చేశారు. దీంతో ఆమెది అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్‌గా తేలింది. ఈనేపథ్యంలో బ్లడ్ గ్రూప్ కోసం రోటరీపురానికి చెందిన రవికిరణ్ సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్‌కు తెలిపాడు. ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయగా సత్యసాయి జిల్లా పెనుకొండకు చెందిన కియా కంపెనీలో పని చేస్తున్న మహేంద్రది అదే రక్తం గ్రూపు అని తేలింది. విషయం తెలుసుకున్న మహేంద్ర అనంతపురానికి వచ్చి సాయినగర్‌లోని దీపు బ్లడ్‌బ్యాంకుకు చేరుకుని రక్తదానం చేశారు. ఆ రక్తాన్ని టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు జెఎల్ మురళీధర్ ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనంలో బళ్లారికి తరలించి బాధితురాలికి ఎక్కించారు.

వినియోగానికి దూరంగా ఎలక్ట్రికల్ కార్లు

◆ అందుబాటులో ఉన్నా వినియోగించని వైనం
◆ ప్రయివేటు అద్దె వాహనాలకే ప్రాధాన్యత
◆ కార్పొరేషన్ అధికారుల వింత వైఖరి

మూలనపడ్డ ఎలక్ట్రికల్ కార్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంను ప్రోత్సహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. అయితే అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించకుండా వాటి స్థానంలో అద్దె వాహనాలను అధికారులు వినియోగిస్తున్నారు. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 ఎలక్ట్రిక్ కార్లు ఉండగా ప్రస్తుతం నాలుగు కార్లు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. రెండు కార్లు మరమ్మతుకు నోచుకోక కార్పొరేషన్ కార్యాలయంలో మూలన పడ్డాయి. మరో రెండు కార్లు 6 నెలల క్రితం మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. మరమ్మతులకు సంబంధించి లక్ష రూపాయల బిల్లు చెల్లించకపోవడంతో టాటా మహేంద్ర షోరూంలోనే అవి నిలిచిపోయాయి. మరో కారు ఒక డిఈఈ నిర్వాకం కారణంగా 2022లో వచ్చిన నడిమివంక వరదల్లో డ్రైవర్ వద్దన్నా వరద నీటిలోకి తీసుకెళ్లాలని ఆదేశించడంతో అది పూర్తిగా చెడిపోయింది. ఎలక్ట్రిక్ కార్లలో తిరగటానికి ఇష్టపడని అధికారులు పట్టుబట్టి మరీ ప్రయివేటు అద్దె వాహనాలను వినియోగించుకుంటున్నారు. బదిలీపై వచ్చిన అధికారులు అదనపు కమిషనర్, ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రయివేటు అద్దె వాహనాల్లో తిరుగుతున్నారు. ఈ నాలుగు వాహనాలకు నెలకు రూ.35 వేల వంతున మున్సిపల్ కార్పొరేషన్ ఖజానా నుంచి రూ.1.40 అద్దె చెల్లించాల్సి ఉంది. తాజాగా మరో అధికారి సైతం తనకు ప్రయివేటు అద్దె వాహనం డ్రైవర్ సమకూర్చి తీరాలని పట్టుబట్టినట్లు తెలియవచ్చింది. టాటా మహీంద్రా షోరూంలో మరమ్మతులు చేసుకుని తిరగటానికి సిద్ధంగా ఉన్న రెండు ఎలక్ట్రిక్ వాహనాలకు లక్ష రూపాయలు బిల్లు చెల్లిస్తే వినియోగంలోకి వస్తాయి. ఈ డబ్బు ఇవ్వకపోవడంతో గడిచిన ఆరు నెలలుగా ఆ వాహనాలు షోరూంలోనే ఉండిపోయాయి. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్య నివారణతో పాటు అద్దె వాహనాలకు ఇచ్చే లక్షలాది రూపాయలు మిగలాలంటే కార్పొరేషన్‌కు అందుబాటులో ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా పాలకవర్గం, అధికారులు చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

రాయలసీమకు అన్యాయం చేసింది జగనే..

టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమకు ఎక్కువగా అన్యాయం జరిగింది వైసిపి ప్రభుత్వం హయాంలోనే అని టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ అన్నారు. సోమవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి వ్యాఖ్యలు 'దయ్యాలు వేదాలు వల్లించినట్లు'గా ఉన్నాయన్నారు. వైసిపి ఐదేళ్లలో హంద్రీనీవాకు ఒక్క రూపాయి అయినా కేటాయించారా? ఒక్క గంపెడు మట్టి తీశారా? అని ప్రశ్నించారు. టిడిపి హయాంలోనే రాయలసీమ అభివృద్ధి చెందిందన్నారు. ఇందుకు కియా పరిశ్రమ ఉదాహరణ అన్నారు. ఈ పరిశ్రమ వల్ల ప్రత్యంగా దాదాపు వెయ్యిమందికి.. పరోక్షంగా వేలాదిమందికి ఉపాధి కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. మీ పాలనలో రోడ్డులో పడిన ఒక గుంతైన పూడ్చిన దాఖలాలు లేవన్నారు. మీరే ఏమీ చేయకపోవడం వల్లే ప్రజలు కేవలం 11 మంది ఎమ్మెల్యేలను గెలిపించారన్నారు. ప్రస్తుతం వారిని కూడా అసెంబ్లీకి వెళ్లకుండా జగన్ అడ్డుకోవడం బాధాకరమన్నారు. కర్నూలు నుండి లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్‌లు తరలిపోతున్నట్లున్న గగ్గోలు పెడుతున్న వైసిపి నాయకులు అవి ఎక్కడికీ వెళ్లలేదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఐదునెలల్లోనే హంద్రీనీవా, రాయలసీమకు సాగు, తాగు నీరదించారన్నారు. ఇందుకు రూ.2,500కోట్లు కేటాయించి తాగు, సాగునీరందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఇప్పటికైనా వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

విద్యార్థులకు నాన్ అవైలబిలిటీ, బర్త్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అపార్ పథకం విద్యార్థులు, తల్లిదండ్రులకు శాపంగా మారిందన్నారు. కూలీ, నాలి చేసుకుని జీవించే తల్లిదండ్రులకు విద్యార్థుల బర్త్, నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ల కోసం రోజు పనులు వదులుకుని తిరగాల్సి వస్తోందన్నారు. కావున ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఆయా సర్టిఫికెట్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు బాలు, చందు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

గురుకుల పాఠశాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల వేదికలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈక సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులపాడు గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో అరకొర పనులు చేసి అసంపూర్తిగా నిలిపివేశారన్నారు. దీంతో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంట్రాక్టర్‌తోపాటు అధికారులపై పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకులు సోము, నాయకులు, వంశీ, నందు, హిరణ్య, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రోడ్డు విస్తరణ పనుల అడ్డగింత

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండల కేంద్రంలో చేపట్టిన అంతర్ రాష్ట్ర రహదారి విస్తరణ పనులను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. మండల కేంద్రంలో దాదాపు కిలోమీటర్ పొడవున రోడ్డు వెడల్పు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి గ్రామ మధ్యలో ఉండటంతో గ్రామానికి అటు, ఇటు కలపడానికి అండర్ పాసింగ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ఆయా పనులను అధికారులు, గుత్తేదారులు సోమవారం చేపట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని అభ్యంతరం తెలిపారు. గుత్తేదారులు ఏర్పాటు చేస్తున్న అండర్ క్రాసింగ్‌తో గ్రామస్తులకు చాలా ఇబ్బందులు కలుగుతాయని ఆక్షేపించారు. 60 అడుగుల వెడల్పు, 23 అడుగుల ఎత్తున రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు పనులను అడ్డుకుంటున్న ప్రజలు

సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బ్యాంకు రిజిస్ట్రార్ ఆదినారాయణ

ప్రజాశక్తి-ఆత్మకూరు

సహకార సంఘ బ్యాంకు అందిస్తున్న సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పిఐసి సహకార బ్యాంకు రిజిస్ట్రార్ జె.ఆదినారాయణ సూచించారు. సోమవారం మండలంలోని పి.యాలేరు సహకార బ్యాంకులో అఖిలభారత సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సహకార వ్యవస్థ ఏర్పడిన విధానం, సహకార సంఘం సభ్యులైన రైతులు, సహకార వ్యవస్థ మధ్య సంబంధాన్ని క్లుప్తంగా వివరించారు. అంతేగాకుండా సహకార సంఘ వ్యవస్థ రైతులకు అందించిన సహకార సేవలను విశదీకరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘ బ్యాంకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ బాలగంగాధర్, మల్లికార్జున, బ్రాంచి మేనేజర్ మంజుల, నార్పల పిఐసి సృజన, సిఇఒ హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంకు రిజిస్ట్రార్ ఆదినారాయణ

జాతీయస్థాయి హాకీ పోటీలకు పాల్తూరు విద్యార్థి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి పి.నందు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 22వతేదీ నుంచి హర్యానా రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థి నందును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సర్వమంగళ అభినందించి జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, రమేష్, సిబ్బంది శ్రీనివాసరాజు, ప్రకాష్‌రెడ్డి, ఎర్రిస్వామి, రామలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాకీ విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజల సమస్యలను పరిష్కరించాలి : ఆర్‌డిఒ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

అధికారుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్‌డిఒ వసంతబాబు సూచించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో తహశీల్దార్ భాస్కర్‌తో కలిసి అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను వెంటనే పరిగణలకు తీసుకుని విచారణ చేపట్టాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, GOOTY
I.P.No:37/2022
Between:
Dudekula Husen Peera ...Petitioner
And
Dudekula Hajee Vali
and another ...Respondants
Notice To Respondant No:1
R1: Dudekula Hajee Vali S/o D.Pedda Hajeepera Dudekula, R/of Teliki Village, Peddavaduguru Mandal, Ananthapuramu Dist.
పై నెంబరు కేసులో 1వ రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 25-11-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
N.M.CHOWDESWARAIAH,
K.SREENIVASULU
Advocates, Gooty. Cell:7396743800

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని కాలువగడ్డ-1 అంగన్వాడీ కేంద్రాన్ని అడిషనల్ సిడిపిఒ నాగమణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మహేశ్వరి, ఆశా వర్కర్లు సుగుణ, బిందు, అంగన్వాడీలు రజియా, అంగన్వాడీ సహాయకురాలు సోనీబాయి, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలను పరిశీలిస్తున్న అడిషనల్ సిడిపిఒ నాగమణి

బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు చూపాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని గుత్తి రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు ఇళ్ల స్థలాలు చూపాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామిడిలోని గుత్తి రోడ్డులో అనేక కుటుంబాలు దాదాపు 40ఏళ్ల నుంచి కూలి పనులు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నివాసం ఉన్నచోటే రేషన్, ఆధార్, ఓటరు కార్డులు, ఇంటి గుత్త రసీదులు, కరెంటు సౌకర్యాలు అన్నీ ఉన్నాయన్నారు. ఈనేపథ్యంలో రోడ్డు వెడల్పులో భాగంగా వీరందరూ ఇళ్లు కోల్పోతున్నారన్నారు. అయితే వీరందరికీ ఎలాంటి నోటీసులూ ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై గతంలో అనేకమారు తహశీల్దార్ కార్యాలయంతోపాటు సచివాలయాల్లో వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందంచి నిబంధనల మేరకు కనీసం 90 రోజులు సమయం ఇచ్చి అర్హులకు ఇంటి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించాలన్నారు. బాధితులు మాట్లాడుతూ అర్హులకు ఇంటి పట్టాలిచ్చి స్థలాలు చూపిస్తే స్వచ్ఛందంగా ప్రభుత్వం చూపించిన స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఖాళీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు శంకర్, ఈశ్వరయ్య, ముత్యాలు, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

కక్షసాధింపే లక్ష్యంగా 'కూటమి' పాలన

వైసిపి సమన్వయకర్త రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కక్షసాధింపే లక్ష్యంగా పాలన సాగుతోందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, నియోజకవర్గ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు విమర్శించారు. స్థానిక ఎన్నికల ఒప్పందం ప్రకారం కంబదూరు మండలం ఎంపిపిగా కురుబ లక్ష్మీదేవమ్మ (భీమేష్)తో సోమవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా కంబదూరు మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ర్యాలీ మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకుని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలే నేడు మనల్ని గ్రామాల్లో తలెత్తుకుని తిరిగేలా చేస్తున్నాయన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదునెలల్లోపే హామీల అమలును విస్మరించి కక్ష సాధింపులే లక్ష్యంగా నాయకులు పని చేస్తున్నారని వాపోయారు. అన్ని స్థానిక సంస్థల్లో మన పార్టీనే అధికారంలో ఉందన్నారు. కావున నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎంపిపి బోయ తిమ్మరాజమ్మను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు బోయ తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిపి లక్ష్మీదేవమ్మకు అభినందనలు తెలుపుతున్న వైసిపి నాయకులు

ఉరవకొండ జోన్ యుటిఎఫ్ మండల కమిటీలు ఎన్నిక

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ జోన్ పరిధిలోని ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాల యుటిఎఫ్ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మండల కమిటీలకు సంబంధించి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి,జిల్లా కార్యదర్శి సంజీవ్ కుమార్,శేఖర్ లు, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు వ్యవహరించారు. ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాలకు సంబంధించి నూతన కమిటీలను ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉరవకొండ మండల కమిటీ

గౌరవాధ్యక్షులుగా సంజప్ప, అధ్యక్షులుగా ఉమాపతి, సహాధ్యక్షులుగా ఎస్.శశికళ, ఎస్.ఇస్లాంబాషా, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా బండయ్య, సభ్యులుగా మురళీకృష్ణ, సురేఖాబాయి, గాయత్రి, మేరీ, రాఘవేంద్రమ్మ, సుష్మాకుమారి, చంద్రశేఖర్, శివప్రసాద్, తిప్పయ్య, జిల్లా కౌన్సిలర్లుగా రాము, వెంకటాచలపతి, బసవరాజు, నాగరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా కె.భాస్కర్, యు.నాగరాజ్ ఎన్నికయ్యారు.

విడపనకల్ మండల కమిటీ

గౌరవాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, సహాధ్యక్షులుగా మల్లికార్జున, హిందూమతి, ప్రధాన కార్యదర్శిగా ఎర్రిస్వామి, కోశాధికారిగా వన్నూరుస్వామి, సభ్యులుగా ఆంజనేయులు, మస్తానప్ప, నాగేంద్రప్రసాద్, జయరాములు, ఎర్రిస్వామి, ప్రకాష్, శర్మస్‌బీ, గౌతమి, హేమలత, ఉమామహేశ్వరి, జిల్లా కౌన్సిలర్లుగా లక్ష్మీదేవి, రాధా, రఘు, చంద్రశేఖర్, మహమ్మద్ రఫీ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా హేమలక్ష్మమ్మను ఎన్నుకున్నారు.

వజ్రకరూరు మండల కమిటీ

గౌరవాధ్యక్షులుగా శ్రీనివాసగుప్త, అధ్యక్షులుగా పావన మురళి, సహాధ్యక్షులుగా మైలార్ లింగ, శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా జయరాములు, కోశాధికారిగా వేణుతోపాటు సభ్యులుగా రామచంద్రనాయక్, రాంబాబు, రామచంద్ర, మోహన్, సుధాకర్, మల్లేశ్వరి, శాలెం, మధుబాబు, ఆంజనేయులు, ధనుంజయవర్మ, జిల్లా కౌన్సిలర్లుగా జానకిరాములు, రాజ్‌కుమార్, నరసింహులు, చంద్రశేఖర్, అశోక్‌కుమార్, శైలజ, శ్రీధర్, చంద్రశేఖర్, రాజశేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శివ, నెంబర్లుగా సంతోష్, రవిచంద్ర ఎన్నికయ్యారు.

యుటిఎఫ్ నూతన కమిటీ సభ్యులు

అభివృద్ధికి మారుపేరు జెసి ప్రభాకర్‌రెడ్డి

వైసిపి హయాంలోనే కక్షసాధింపు చర్యలు : టిడిపి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

తమ నాయకులు జెసి ప్రభాకర్‌రెడ్డి అభివృద్ధికి మారుపేరు అని అనంతపురం పార్లమెంట్ తెలుగు యువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆవులంపల్లి కేశవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం జరిగిన ఓ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెసి ప్రభాకర్‌రెడ్డిని సామంతరాజులుగా అభివర్ణించడం విడ్డూరంగా ఉందన్నారు. 2019 నుంచి 2024 వరకూ ఉదాహరణకు ప్రబోధానంద కేసులో పెద్దవడుగూరుకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మండలానికి సంబంధించి ఏ వ్యక్తీ ఆ అల్లర్లలో పాల్గొనలేదు.. అలాంటి కేసులో పెద్దవడుగూరుకు చెందిన చిన్నవడుగూరు దివాకర్‌రెడ్డి, గంగరాజు, హరినాథ్‌రెడ్డిపై కేసు పెట్టి రిమాండ్‌కు తరలించలేదా.. అని ప్రశ్నించారు. అంతేగాకుండా మీ హయాంలో జెసి ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు ఎస్‌వి రవీంద్రారెడ్డిని జిల్లా బహిష్కరణకు గురి చేశారన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడు కేవలం కక్ష సాధింపు చర్యలే చేపట్టారన్నారు. జెసి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు జెసి అస్మిత్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి ఆరునెలలు కడప సెంట్రల్ జైలుకు పంపారన్నారు. తాము 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్నా జెసి ప్రభాకర్‌రెడ్డి ఎలాంటి కక్షలు లేకుండా అభివృద్ధే ధ్యేయంగా పని చేశారన్నారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే ఇలాంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వెల్పుల గంగరాజు, చిరంజీవి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆధార్ సెంటర్ పరిశీలన

ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న నార్పల ఎంపిడిఒ గంగావతి

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఎంపిడిఒ గంగావతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అపార్ కార్డు నమోదులో భాగంగా విద్యార్థుల ఆధార్ కార్డుల్లో ఉన్న తప్పొప్పులను సరిచేసేందుకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం కూడా ఆధార్ సెంటర్ కొనసాగుతుందన్నారు. కావున విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ప్రధానోపాధ్యాయుడు నాగేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కడవకల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఎంపిడిఒ అలివేలమ్మ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఆధార్ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మోడల్ స్కూల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ శ్రీదేవితో కలిసి పరిశీలించారు.

చిరు వ్యాపారులకు శిక్షణ

ప్రజాశక్తి-గుత్తి

పీఎం ఆత్మ నిర్భర్ నిధి, పిఎం స్వనిధి డిజిటల్ లావాదేవీలు, పథకం లబ్ధిపై ఈనెల 18 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకూ మున్సిపాలిటీ పరిధిలోని వీధివిక్రయదారులు, చిరు వ్యాపారులకు ఏర్పాటు చేసిన శిక్షణను సోమవారం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బి.జబ్బర్ మియా, మెప్మా సిఎంఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులకు మొదట రూ. 10వేలు, 2వ విడత 20వేలు,3వ విడత 50వేలు రుణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని డిజిటల్ లావాదేవీల ద్వారా కంతులు చెల్లింపు చేసే విధానాన్ని సులభతరం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిసిసి బ్యాంకు మేనేజర్ జానకిరామిరెడ్డి, సిఒలు చంద్రశేఖర్, సురేఖ, మెప్మా సిబ్బంది, లబ్ధిదారులు, చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

జెఎన్‌టియు ఆడిట్ డైరెక్టర్‌గా బి.దుర్గాప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం

జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య ఆదేశాల మేరకు అకడమిక్ ఆడిట్ డైరెక్టర్‌గా బి.దుర్గాప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయనతోపాటు అడిషన్ డైరెక్టర్‌గా ఎ.సురేష్‌బాబు, ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్లేస్‌మెంట్ (ఐఆర్‌పి), ఎసిసిడిఇ డైరెక్టర్‌గా ఎ.శిరిణ్మయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు.

డైరెక్టర్లను అభినందిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-డి.హీరేహాళ్

మండలంలోని గుడిసెపల్లి దళితవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం కార్యవర్గ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదురోజులుగా దళితవాడలో తాగునీటి సమస్య నెలకొన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. దళితవాడ అంటే నాయకులు, అధికారులకు ఎందుకింత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. వెంటనే దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. అలాగే దళిత కాలనీలకు నీరు సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వినతిపత్రం అందజేస్తున్న దళితవాడ ప్రజలు

వైసిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో నివాసం ఉండే వైసిపి సీనియర్ నాయకుడు ఖలీల్ (56) సోమవారం మృతిచెందారు. ఖలీల్ వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో తన ఇంట్లో ఉన్నఫలంగా కుప్పకూలి కిందపడి మరణించారు. ఆయన మృతికి వైసిపి పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు సంతాపం వ్యక్తం చేశారు.

ఖలీల్ (పాతచిత్రం)

సుంకులమ్మ ఆలయానికి రూ.50వేలు విరాళం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఎంగిలిబండ గ్రామంలో ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన సుంకలమ్మ ఆలయానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, సోదరుడు గుమ్మనూరు నారాయణ విరాళం ఇచ్చారు. ఎంగిలబండ గ్రామస్తులు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఉన్న ఈశ్వర్, నారాయణ లను ఆలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. దీంతో వారు గ్రామస్తులకు రూ.50 వేలు విరాళం అందజేశారు. ముందుగా టిడిపి నాయకులు చికెన్ శీనా, వాసుయాదవ్ వారి స్వగృహాల్లో నిర్వహించిన గౌరీ పూజకు ఈశ్వర్, నారాయణ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ఎంకె.చౌదరి, జక్కలచెరువు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న గుమ్మనూరు నారాయణ, ఈశ్వర్

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని వద్రవన్నూరు గ్రామానికి చెందిన హనుమంతు (28) కుటుంబ కలహాలతో సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డి.హీరేహాల్ మండలం మడేనల్లికి చెందిన హనుమంతు వద్రవన్నూరులో వివాహం చేసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మారెంపల్లి కాలనీలో...

ఉరేసుకున్న నూర్‌బాషా

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక మారెంపల్లి కాలనీలో ఉన్న రేషంతోటలో వ్యక్తి సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... కళ్యాణదుర్గం మండలం మారెంపల్లి కాలనీకి చెందిన నూర్‌బాషా (36) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం నందివర్గం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు 12 మంది కలిసి ఆటోలో గుంతకల్లు మండలం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు స్వగ్రామానికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. గుత్తి సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ప్రమాదంలో అంజనమ్మ, రామాంజనేయులు, హనుమన్న, నిర్మలమ్మ, లక్ష్మీ, సుప్రియ, కీర్తి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న బాధితులు

బంగారు గొలుసు రికవరీ

నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ

యల్లనూరు : చోరీకి గురైన బంగారు గొలుసును రికవరీ చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండల కేంద్రంలో కోలాటం నాగయ్య, భార్య కోలాటం పెద్దక్క కూరగాయలు వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. ఇందులో భాగంగా జూలై 14న కూరగాయల వ్యాపారం చేసుకుని ఇంటికి వచ్చి చూసే సరికి బీరువాలోని 3.5 గ్రాముల బంగారు గొలుసు చోరీకి గురైంది. విషయంపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జూలై 15న ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారించగా తనయుడు కోలాటం శంకర్ చోరీ చేసినట్లు తేలిందన్నారు. నిందితుడి నుంచి గొలుసును స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేసినట్లు తెలిపారు.

మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఆదివారం కొందరు టెంకాయ పందెం ఆడుతుండగా ఎస్ఐ శ్రీరామప్రసాద్ సిబ్బందితో వెళ్లి దాడి చేయగా నిందితులు పారిపోయినట్లు తెలిపారు. దీంతో అక్కడే ఉన్న ద్విచక్ర వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



అబ్దుల్ రెహమాన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌కు అభినందనలు

రాయదుర్గం రూరల్ : గుజరాత్‌లోని హేమచంద్రాచార్య విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొని చక్కని ప్రదర్శన ఇచ్చిన స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ అబ్దుల్ రెహమాన్‌ను సోమవారం స్థానిక కళాశాలలో అభినందించారు. సమైక్యత శిబిరంలో బృందచర్చ, మేక్ ఇన్ ఇండియా, సైబర్ సెక్యూరిటీ, వ్యక్తిత్వ వికాసం, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, బంద నృత్యం, సంప్రదాయ వస్త్రధారణ, తదితర కార్యక్రమాల్లో అబ్దుల్‌రెహమాన్ అద్భుతమైన ప్రదర్శన ఇవ్వడంతో ప్రశంసాపత్రం అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, కోదండరాములు, నాగప్ప, అధ్యాపకులు ఫరీసాఫిర్దోస్, వినోద్‌కుమార్, పాండురంగ పాల్గొన్నారు.

పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి : ఎస్‌టియు

అనంతపురం : ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్ పాఠశాలల పనివేళల్లో మార్పు చేస్తూ సాయంత్రం 5 వరకూ పొడిగించాలన్న ఉద్దేశంతో పైలెట్ ప్రాజెక్టు కింద నెల్లూరు జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో కొనసాగించాలని నిర్ణయించిందన్నారు. అయితే దీన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం పక్షాన తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పనివేళల మార్పు ప్రయోగం రాష్ట్రంలో అమలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విధంగా చేస్తే మానసికంగా విద్యార్థులు, బోధనాపరంగా ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. కావున ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచించుకోవాలని సూచించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

పుట్లూరు : కార్తీకమాసం 3వ సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత భోగభోగేశ్వరస్వామి ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం హోమం, అన్నదానం చేశారు.

శింగనమల : మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో దోన రామేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయ పునర్నిర్మాణ దాత శింగనమల శంకర్‌బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సుబ్బరంగయ్యస్వామి అభిషేకం, రుద్రాభిషేకం చేశారు.

టిడిపి సభ్యత్వ నమోదు

పామిడి : ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, మండల ఇన్‌ఛార్జి ఈశ్వర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని 10వవార్డులో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ లంగాల గౌస్‌పీరా మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదు తీసుకుంటే అనేక లాభాలు పొందవచ్చన్నారు. ముఖ్యంగా బీమాతో కుటుంబానికి భరోసా లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాదిలింగప్పగౌడ్, కృష్ణమోహన్, కబీర్, సుంకప్ప, హమాలీ గోపాల్, శివ అభిరామ్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత నమోదు చేస్తున్న నాయకులు

కనకదాస జీవితం ఆదర్శనీయం

జయంతి వేడుకల్లో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియులో భక్త కనకదాస జయంతి వేడుకలను పరిపాలన భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్త కనకదాస చిత్ర పటానికి ఉపకులపతి హెచ్. సుదర్శన రావు, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వీసీ ఓఎస్‌డి ఆచార్య ఎన్. దేవన్న తదితరులు పూలమాలలు వేసి నివాలుల అర్పించారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, పి.సుజాత, నాగప్రసాద్ నాయుడు, పద్మ సువర్ణ, ఎస్‌వి.సత్యనారాయణ, ఈశ్వర్ రెడ్డి, సురేష్ బాబు, వైశాలి ఘోర్పడే, ప్రశాంతి, కిరణ్మయి పాల్గొన్నారు.

ఉరవకొండ : కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జీవితం యువతకు ఆదర్శమని సర్పంచి మల్లేల జగదీష్ పిలుపునిచ్చారు. కనకదాసు జయంతిని పురస్కరించుకునిసోమవారం వజ్రకరూరు మండల పరిధిలోని చాబాల పంచాయతీ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్, విలేజ్ రెవెన్యూ అధికారి సురేంద్ర, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రమోద్, విలేజ్ సర్వే భాను, అగ్రికల్చర్ అసిస్టెంట్ కళ్యాణి, డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి, వన్నూరు, జి.మహేష్, గురు, గొల్ల నాగరాజు, మాల రామన్న, బాషా, హమీద్, ధర్మపురి రామిరెడ్డి, నెట్టికల్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో కనకదాస చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్ : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులి ఆదేశాల మేరకు సోమవారం పట్టణంలోని టిడిపి ప్రజా వేదిక వద్ద కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ నీలాస్వామి, మండల కన్వీనర్లు గొల్ల వెంకటేశులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పాపంపల్లి రామాంజినేయులు, కంబదూరు కన్వీనర్ శివన్న, గొల్ల రమేష్, మాజీ కన్వీనర్ డీకే రామాంజినేయులు, నాగరాజు, మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షులు డిష్ మురళి, షామీర్, కురేగౌడ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని వైసిపి క్యాంపు కార్యాలయంలో కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి సుదర్శనరావు

ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, నియోజకవర్గ నాయకులు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మునివేలు ఆధ్వర్యంలో సోమవారం కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కురుబ సంఘం కన్వీనర్ నాగరాజు, మాజీ ఎంపిటిసి కంచప్ప, ఎంఇఒ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి : తాడిపత్రి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రవికుమార్‌నాయుడు ఆధ్వర్యంలో కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు జి.ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ కె.నాగరాజు, ఎస్.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలో కనకదాస విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు శంకర్, వెంకటేష్, కప్పల దామోదర్, వెంకటస్వామి, సతీష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సు నడపాలని వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న నాయకులు

కనేకల్లు మండలం పరిధిలోని పుల్లంపల్లి నుంచి ఆదిగానిపల్లి, కె.కొత్తపల్లి మీదుగా కనేకల్ బస్సు సర్వీసును నడపాలని టిడిపి, బిజెపి నాయకులు విన్నవించారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికలో ఆర్‌డిఒ వసంతబాబుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదిగానిపల్లి గ్రామ సర్పంచి పి.రుద్రముని, బిజెపి మాజీ మండల అధ్యక్షుడు కె.తిప్పేస్వామి, బిజెవైఎం మండల అధ్యక్షులు ఎ.తిప్పారెడ్డి, కె.హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ఉరవకొండ

ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అసంక్రమిత వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సి హెచ్ ఓ.నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి.షఫీ సూచించారు. సోమవారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రాకెట్ల గ్రామంలో అసంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18ఏళ్ల పైబడిన ప్రతిఒక్కరికీ బిపి, షుగర్, క్యాన్సర్, గర్భాశ క్యాన్సర్, రొమ్ము కాన్సర్, నోటిక్యాన్సర్ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఏఎన్‌ఎం పద్మావతి, అశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కర్ణాటక మద్యం వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఉరవకొండ : జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మునిస్వామి ఆదేశాల మేరకు సోమవారం విడపనకల్ మండలంలోని డోనేకల్ గ్రామంలో దాడి చేసి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఎస్.ఆదినారాయణను అరెస్టు చేసి 192 విస్కీ, టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని ఉరవకొండ కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఉరవకొండ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ రవిచంద్ర, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ హరికృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రభుత్వ వసతి గృహాల్లో మెరు గైన వసతులు కల్పించాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న బాలుర వసతి గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 16 వసతి గృహాలు ఉండగా 1,270 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థికీ మెరుగైన వసతితోపాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అలాగే తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమమంలో జనసేన పార్టీ నాయకులు మణికుమార్, మల్లికార్జున, వంశీ, రూపేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి-ఉరవకొండ

పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 20న నిర్వహించనున్న వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయాధికారి వై.ప్రతాపరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

రాప్తాడు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వి.వీరనారాయణరెడ్డి. ప్రధానోపాధ్యాయులు సాంబశివరావు, శ్రీహరి, పి.సాయిప్రసాద్, పి..లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.